సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శుక్రవారం 15-11-2024

సంపుటి: 20 సంచిక: 197

పేజీలు: 4 వెల: రూ.1




## బాలియాత్రను విజయవంతం చేయండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సంప్రదాయంగా కొనసాగుతున్న బాలియాత్రలో కళింగులంతా పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజయవంతం చేయాలని దర్శక నిర్మాత, కళింగ చరిత్ర పరిశోదకుడు గూన అప్పారావు పిలుపునిచ్చారు. శుక్రవారం కటక్‌లో జరుగుతున్న బాలి ఉత్సవంలో పాల్గొంటున్న ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 17న కళింగుల ప్రాచీన రాజధాని శ్రీముఖలింగంలో నిర్వహించే బాలియాత్రలో పాల్గొనాలని కోరారు. కళింగుల ఆచారం ప్రకారం కార్తీక పౌర్ణమి రోజునే నిర్వహించాల్సిన బాలియాత్ర అనివార్య కారణాల వల్ల ఈ నెల 17న శ్రీముఖలింగంలో జరుగుతుందన్నారు. కళింగ మహాజన పదంలోని 12 జానపదాలు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

★ సీఎం హెచ్చరికలు పట్టించుకోని నేతలు

★ గొలుసు దుకాణాలకు వేలం పాటలు

★ 4 నియోజకవర్గాల్లో ఎమ్మార్పీపై రూ.20 అదనం

# 'బెల్టు' కట్టకపోతే.. సేల్ జారిపోతుందా?



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

**అధిక మొత్తంలో మద్యం అమ్ముకోవాలంటే బెల్టుషాపులే ప్రత్యామ్నాయ వ్యాపారంగా మద్యం వ్యాపారులు చూస్తున్నారు. మద్యం దుకాణాల్లో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వాటాలున్న ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల సహకారంతో సాగిస్తున్న బెల్టు వ్యాపారంపై చర్యలు తీసుకునే సాహసం అధికారులు చేయలేరు. మద్యం వ్యాపారం ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలన్న నినాదం వెనుక బెల్టుషాపులే కీలకం. ప్రభుత్వం ఇచ్చిన మార్జిన్‌తో సరిపుచ్చుకునే వ్యాపారం కాదిది. కేవలం బ్యాక్‌డోర్ అమ్మకాల ద్వారా మాత్రమే ఇక్కడ వ్యాపారుడు సంపాదిస్తుంటాడు, ఎక్సైజ్ అధికారులు తాము కొనుక్కున్న ఆస్తులకు ఈఎంఐలు కడుతుంటారు. ఒక ఏరియాకు ఎన్ని వైన్‌షాపులు ఉండాలన్న లెక్క ప్రభుత్వం వద్ద లేకపోయినా, ఒక వైన్‌షాపు పరిధిలో ఎన్ని గ్రామాలకు బెల్టు ద్వారా మద్యం సరఫరా చేయొచ్చన్న లెక్క మాత్రం సిండికేట్ వద్ద ఉంటుంది. ఇందుకోసం పిల్లి తన పిల్లల్ని మార్చినట్టు షాపును కూడా బెల్టుకు అనుగుణంగా మార్చారంటే అది ఎంత పవర్‌ఫుల్లో అర్థం చేసుకోవచ్చు. ఇందుకు ఓ తాజా ఉదాహరణ చూద్దాం.**



ఆమదాలవలస నియోజకవర్గం దూసికి కేటాయించిన మద్యం షాపు నెంబర్ 39ని తోటాడలో ఏర్పాటుచేశారు. కొత్తవలస, దూసిలో మద్యం షాపులు పక్కపక్కనే ఉండడం వల్ల మండలంలో బెల్ట్‌షాపులకు మద్యం పంపిణీకి గ్రామాలు సర్దుబాటు కావడం లేదని శాశ్వత లైసెన్స్ జారీ చేసిన తర్వాత తోటాడ పంచాయతీ పరిధిలో వెంకటేశ్వర కాలనీ అపార్ట్‌మెంట్ల మధ్య పొలాల్లో కంటైనర్లలో మద్యం షాపు తెరిచారు. దీనివల్ల దూసి, కొత్తవలస షాపుల నుంచి బెల్టులకు వెళ్లే గ్రామాలు కాకుండా శ్రీకాకుళం నగరానికి ఆనుకొని ఉన్న తోటాడ, గోపీనగరం వంటి ప్రాంతాల బెల్ట్‌షాపులకు మద్యం డోర్ డెలివరీ చేయడానికే ఈ వ్యవహారమంతా నడిచింది.

బెల్టుషాపులు తెరిస్తే బెల్టు తీస్తానంటూ ఈ నెల 1న ఈదుపురం సభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హెచ్చరించిన రెండు రోజులకే గార మండలం రామచంద్రాపురం పంచాయతీ జొన్నలపాడులో ఐదు బెల్టుషాపుల నిర్వహణకు రెండేళ్లకు గానూ రూ.2 లక్షలకు గ్రామ పెద్దల సమక్షంలో వేలం పాట ఖరారు చేశారు. ముగ్గురు వ్యక్తులు తప్ప ఇంకెవరూ బెల్టుషాపులు పెట్టి మద్యం విక్రయించరాదని గ్రామంలో తీర్మానం చేశారు. ఎచ్చెర్ల నియోజకవర్గం రణస్థలం మండలంలో పాతర్లపల్లిలో బెల్టుషాపు నిర్వహణకు ఏడాదికి రూ.16లక్షలు కట్టుబడిగా నిర్ణయించినట్లు తెలిసింది. లావేరు మండలం సుభద్రాపురంలో బెల్టుషాపు నిర్వహణకు రూ.4లక్షలు చెల్లించాలని గ్రామంలో తీర్మానం చేసుకున్నారని విశ్వసనీయ సమాచారం. ఈ గ్రామాలన్నీ వైకాపాకు పట్టున్న గ్రామాలు కావడంతో అందరూ ఆ పార్టీ నాయకులు మద్యం బెల్ట్‌షాపులు తెరిచి అక్రమాలకు పాల్పడుతున్నారనే ప్రచారం జరుగుతోంది. బెల్టు దుకాణాలు తెరిచినా, అధిక ధరలకు మద్యాన్ని అమ్మినా పీడీ యాక్ట్ నమోదు చేసి జైల్లో పెడతామంటూ చంద్రబాబు హెచ్చరించినా మద్యం షాపుల్లో వాటాలు పెట్టిన టీడీపీ నాయకులు పెడచెవిన పెట్టారు. గతంలో మాదిరిగా గ్రామాల్లో బెల్ట్‌షాపులు తెరిచి మద్యం విక్రయిస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు మాత్రం బెల్ట్‌షాపులు లేవని చెబుతున్నారు. బెల్ట్ షాపులను ప్రోత్సహించే మద్యం దుకాణాలు లైసెన్స్ రద్దు చేస్తామని చంద్రబాబు హెచ్చరికలను టీడీపీ నాయకులే పట్టించుకోవడం లేదు.

మద్యం వ్యాపారాన్ని అన్ని పార్టీల నాయకులు కలిసి చేసుకుంటున్నారు. గ్రామాల్లో బెల్టుషాపుల నిర్వహణలో అందరూ భాగస్వామ్యం కావాలి కాబట్టి అనివార్యంగా కూటమి నాయకులు, వైకాపా నాయకులనూ కలుపుకుపోతున్నారు. గ్రామాలు, పట్టణాల్లోని ప్రధాన కూడళ్లు, వీధి శివార్లలో పాన్‌షాపుల్లో మద్యం దుకాణాలకు సమాంతరంగా బెల్టుషాపులు నడుస్తున్నాయి. గ్రామాల్లోనూ బెల్ట్‌షాపులకు వేలం అవకాశం ఇచ్చి వేలం పాట నిర్వహించడం వల్ల గ్రామానికి ఆదాయం సమకూరుతుందన్న ఆలోచనతో గ్రామ పెద్దలు ఉన్నారు. గ్రామ జనాభా, మద్యం డిమాండ్, గ్రామ దేవత ఉత్సవాలను దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో ఏకంగా వేలం నిర్వహిస్తున్నారు. అమ్మకాలపై 20 శాతం మార్జిన్ అనుకుంటే చేతికి 9 శాతమే వస్తోందని తేలడంతో బెల్ట్‌షాపులు తెరవడం అనివార్యమంటున్నారు. అలాగే టెక్కలి, నరసన్నపేట, ఆమదాలవలస లాంటి చోట్ల బాటిల్‌పై

మిగతా 4లో






# 1800 కిలోమీటర్లు.. 50 రోజులు

✔ 'బాబు' మొక్కును తీర్చుకుంటున్న కొత్తూరువాసి

✔ వైకాపా అరాచకాలు చూడలేక అయ్యప్పకు ముడుపు

(సత్యంన్యూస్, కొత్తూరు)

ఒకటి కాదు, రెండు కాదు.. ఏకంగా 1800 కిలోమీటర్లు. వారం కాదు, పక్షం కాదు.. ఏకంగా 50 రోజులు. శక్తిని, సొమ్మును వెచ్చించి శబరిమలకు కాలినడకన వెళ్తున్నాడు కొత్తూరు మండలం బమ్మిడికి చెందిన గండెం సూర్యనారాయణ (42). చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే అయ్యప్ప దీక్ష తీసుకొని తన గ్రామం బమ్మిడి నుంచి శబరిమల వరకు కాలినడకన వెళ్తానని మొక్కుకున్నారు. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావడంతో సూర్యనారాయణ తన మొక్కును చెల్లించడానికి సోమవారం కాలినడకన శబరిమలకు బయల్దేరుతున్నారు. ఇది అక్షరాలా 1800 కిలోమీటర్లు వస్తున్నట్టు గుర్తించారు. ఇందుకోసం 50 రోజులు పడుతుంది. దారిలో హిందూ దేవాలయాల్లో ఎవరైనా భిక్ష పెడితే తినడం, లేదూ అంటే ఉపవాసాలు ఉండటం మినహా ఇన్ని వందల కిలోమీటర్లు వంటసామగ్రితో నడవలేమని గండెం సూర్యనారాయణ 'సత్యం'కు తెలిపారు. 2014లో జన్మభూమి కమిటీ సభ్యుడిగా ఉన్న గండెం సూర్యనారాయణకు చెందిన కళ్లాలను 2019లో వైకాపా ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇళ్ల నిర్మాణాల కోసం తీసుకోవాలని ప్రయత్నించింది. తనలాంటి కళ్లాలే గ్రామంలో చాలామందికి ఉన్నాయని, అందరి వద్ద ఒకే నిష్పత్తిలో భూములు సేకరించాలని గండెం సూర్యనారాయణ కోరినా వైకాపా నేతలు, అప్పటి రెవెన్యూ అధికారులు వినిపించుకోలేదు. దీంతో కోర్టును ఆశ్రయించి స్టే ఆర్డర్ తెచ్చుకోవడంతో సూర్యనారాయణ భూములు మిగిలాయి. అప్పుడే చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే తప్ప తమకు ఈ కక్షసాధింపులు ఆగవని, చంద్రబాబు గెలిస్తే




కాలినడకన శబరిమల వస్తానని ఆయన మొక్కుకున్నారు. జనవరి 10లోగా శబరిమల చేరుకునే విధంగా ఏర్పాట్లు చేసుకున్నారు. ఇప్పటికే 30 రోజుల దీక్ష పూర్తిచేసిన ఆయన సోమవారం బమ్మిడి నుంచి బయల్దేరి, ముందుగా తిరుపతి చేరుకొని, అక్కడ ఇరుముడి వేసుకొని కాట్పాడి మీదుగా కేరళలో అడుగుపెడతారు. అక్కడ మళ్లీ వనయాత్ర ద్వారా అయ్యప్పను దర్శించుకొని మొక్కు తీర్చుకోనున్నారు. ఈయన వెనుక మరో ముగ్గురు భక్తులు అయ్యప్ప మాలధారణతో వెళ్తున్నారు.

• ఎడిటోరియల్

# ప్రజాస్వామ్య స్ఫూర్తిని కూల్చడమే..!

రౌడీలు, గూండాలు, దొంగలు, దోపిడీదారుల అరాచకాలకు పాల్పడటం మనకేమీ ఆశ్చర్యం అనిపించదు. ఎందుకంటే వాళ్లలా చేస్తారు కాబట్టే రౌడీలు, గూండాలు అంటున్నాం, అసలైన ఆశ్చర్యం ఏమంటే, రాజ్యాంగం ప్రకారం ఎన్నికయిన ప్రజా ప్రభుత్వాలనబడే సర్కార్లే అరాచకానికి దిగితే, ఇంకా ఎవరిదగ్గర మొరపెట్టుకుంటారు ప్రజలు! అయితే చివరికి అత్యున్నత న్యాయస్థానం దగ్గర మొరపెట్టుకోక తప్పలేదు బాధితులకు. అహంకారంతో అనేక దుర్మార్గాలకు పాల్పడతారు నియంతలు. అలాంటి అహంకారం ప్రజాస్వామిక ప్రభుత్వాలు ప్రదర్శించటమే నేటి విడ్డూరం! ప్రభుత్వాలు ప్రజలవైపు నుంచి ఆలోచిస్తాయని సాధారణంగా మనం భావిస్తాము. రాజ్యాంగ హక్కులను, విలువలను పాటిస్తాయనీ అనుకుంటాం! కానీ అవేమీ పట్టించుకోకుండా ప్రభుత్వాలు ఎందుకు ఇలా వ్యవహరిస్తున్నాయి? ప్రభుత్వాలలో మతవివక్షతలు, కులవివక్షతలు పెరిగిపోయి ఈ అరాచకానికి పాల్పడుతున్నాయి. అందుకు నిలువెత్తు ఉదాహరణే ఈమధ్య సుప్రీంకోర్టు చేసిన హెచ్చరికలు, తీర్పులు. గత కొంతకాలంగా ఉత్తరప్రదేశ్‌లో 'బుల్డోజర్‌రాజ్' పరిపాలన సాగుతోందన్న విషయం అందరికీ తెలుసు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడిన వారిని, ముఖ్యంగా ముస్లిం సమూహాన్ని, హక్కుల కోసం పోరాడేవారిని టార్గెట్ చేసుకుని, వారి ఇండ్లను బుల్డోజర్‌లతో కూలగొట్టడం, అక్రమంగా నిర్మించారని ఆరోపించడం జరుగుతోంది. 2019లో ఉత్తరప్రదేశ్‌లోని మహారాజ్ గంజ్‌కు చెందిన మనోజ్ తిబ్రెవాల్ ఇంటిని కూడా ఇలానే కూలగొట్టింది ప్రభుత్వం. దానిపై అతను కోర్టుకు వెళ్లాడు. విచారించిన ధర్మాసనం సంచలనమైన వ్యాఖ్యలు చేసింది. 'ఉత్తరప్రదేశ్‌లో ప్రభుత్వం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోంది. రాత్రికి రాత్రే బుల్డోజర్లు పంపి అక్రమ నిర్మాణాల పేరుతో ఇల్లును కూల్చివేయడం తప్పు' అని స్పష్టం చేసింది. కేవలం 3.7 చదరపు మీటర్ల స్థలాన్ని ఆక్రమించారన్న కారణంతో ఇల్లును కూల్చివేసినందుకు, బాధితునికి రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించింది. రోడ్డు విస్తరణ సమయంలో ఎలా వ్యవహరించాలో అన్ని రాష్ట్రాలకూ మార్గదర్శకాలను జారీచేసింది. యూపీలో ఇప్పటికి 123 ఆవాసాలను కూల్చివేశారని, నోటీసు లేకుండా కేవలం చాటింపు వేసి కూల్చడం అహంకారంతో చేసిన చర్య తప్ప చట్టబద్ధమైనది కాదని, ఇది పూర్తి అరాచకమని వ్యాఖ్యానించింది. ఇది ఇండ్లను కూల్చడం కాదు, రాజ్యాంగపు హక్కులను కూల్చడం. విలువల్ని కూల్చడం. ప్రజాస్వామిక సంప్రదాయాన్ని కూల్చడం. ఈ కూల్చడాల వెనుక మతం, కులం ఉండటం మరింత ఘోరమైన విషయం. పై విషయాలతో పాటుగా సుప్రీంకోర్టు మరో అంశంపైనా తీవ్రంగానే స్పందించింది. గోరక్షణ పేరుతో మూక హత్యలకు పాల్పడుతున్న దళాలపై ఆందోళన వ్యక్తం చేసింది. వీరి దాడులు పెరుగుతున్న రాష్ట్రాలలో ప్రభుత్వాలు ఏమి చేస్తున్నాయని నిలదీసింది. మోడీ అధికారంలోకి వచ్చాక, బీఫ్ తింటున్నారనే నెపంతో అక్లాక్‌ను చంపిన సంఘటన నుంచి, వివిధ రాష్ట్రాలలో గోరక్షణ పేరుతో దాడులకు తెగబడటం, అరాచకం సృష్టించటం బాగా పెరిగిపోయింది. ఇది కూడా 75 ఏండ్లుగా పెంపొందించుకున్న లౌకిక విలువల్ని కూల్చడమే. ఆహారపు హక్కులను ధ్వంసం చేయటమే. ప్రభుత్వాలు ప్రజల హక్కులను, ప్రాణాలను కాపాడాల్సి ఉండగా, దానికి భిన్నంగా ప్రాణాలు తీసే పాత్రను పోషించడం, హక్కులను కాలరాయడం చాలా దారుణమైన విషయం. డబుల్ ఇంజన్ సర్కార్‌ల పేరుతో బుల్డోజర్‌రాజ్ కొనసాగటం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు. అప్పుడప్పుడైనా కోర్టులు ఇలా హెచ్చరించినపుడే ప్రభుత్వాల నిజస్వరూపాలు బయటపడుతున్నాయి. ఈ హెచ్చరికలను ప్రభుత్వాలు, నాయకులు పట్టించుకుంటాయా లేదా అనేది తేలాల్సి ఉంటుంది. తెలంగాణలో కూడా ఆక్రమణల పేరుతో ఇండ్లను కూల్చేటప్పుడు ముందుగా నోటీసులివ్వడం, నిబంధనలు పాటించాలి. పేదవారికి ప్రత్యామ్నాయాన్నీ చూపించాలి. ఏదిఏమైనా అహంకారంతో అరాచకంగా వ్యవహరించే ప్రభుత్వాల తీరును ప్రధాన న్యాయస్థానం గుర్తించి నిలదీయడం, హెచ్చరించడం మంచి పరిణామం. ఈ విషయాలను ప్రజలు అవగాహన చేసుకుని, అలాంటి ప్రభుత్వాలను ప్రజాస్వామ్య విధానం ద్వారానే కూల్చడం సరైన ప్రతిచర్య అవుతుంది. ప్రభుత్వ నిర్మాణాలకు భూమి అవసరమని భావించినప్పుడు ఇష్టారాజ్యంగా ప్రైవేటు వ్యక్తులకు చెందిన భూములు తీసుకోడానికి వీల్లేదని కూడా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయం. నష్టపరిహారం చెల్లిస్తున్నాం కదాని భూమితో ఉన్న బంధాన్ని బలవంతంగా లాక్కోవడం సరికాదని సుప్రీం పేర్కొంది. అయితే మన దేశంలో ఏ చట్టమైనా, ఏ తీర్పయినా అమలుజరిగే విధానం సామాన్యుడికొకలా, పెద్దోళ్లకు మరోలా మారుతోంది. ప్రతీసారి కోర్టు తలుపు తట్టడం ఎంతమందికి సాధ్యమవుతుంది?

# అనాథ పిల్లలకు ఆశ్రయం






మన దేశంలో ప్రతి సంవత్సరం లక్షమందికి పైగా పిల్లలు అదృశ్యం అవుతున్నారు. అంటే రోజుకు సుమారు 280 మంది. అందులో 100 మంది ఆడపిల్లలే ఉంటున్నారని సర్వేలు చెబుతున్నాయి. వీరిలో తిరిగి కుటుంబాలకు చేరేది 50 శాతం మందే. మిగిలినవారు ఏమవుతున్నారు. వీరంతా రైల్వేస్టేషన్లలో, బస్టాండ్లలో ఇలా ఎక్కడెక్కడో పనులు చేసుకుంటూ దోపిడీకి గురవుతున్నారు. రద్దీగా ఉండే రైల్వేస్టేషన్లలో పిల్లలు మిస్ అయ్యే అవకాశం ఎక్కువగా ఉంది. వీరిని త్వరగా గుర్తించకపోతే వారి జీవితం ఒంటరిమయం అవుతుంది. ఇలాంటి వారికోసమే రైల్వే చిల్డ్రన్ ఇండియా అనే ఫౌండేషన్ కృషి చేస్తోంది.

వాలంటీర్ల సాయంతో 35 ప్రధాన రైల్వేస్టేషన్ల సమీపంలో అనేక మంది పిల్లలను సంరక్షించారు. 'మిస్ అయిన పిల్లలను 15 నుంచి 20 నిమిషాల్లో గుర్తించకపోతే వారిని కాపాడలేం' అని రైల్వే చిల్డ్రన్ ఇండియా సీనియర్ మేనేజర్ లోపాముద్ర ముల్లిక్ తెలిపారు. 'మిస్ అయిన తర్వాత వాళ్లు కుటుంబాన్ని చేరుకోకపోతే హ్యూమన్ ట్రాఫికింగ్‌కు గురువతారు. వారి జీవితం ప్రమాదంలో పడుతుందని' ముల్లిక్ అంటున్నారు. ఆర్‌సీఐ తమ 24 గంటల అవుట్‌రీచ్ టీమ్‌ల ద్వారా రైల్వేస్టేషన్లలో అదృశ్యమైన పిల్లలను గుర్తించి సురక్షిత ఆశ్రయం అందజేస్తోంది. తాత్కాలిక వసతి నుంచి దీర్ఘకాల సహాయం వరకు, వీరికి అన్ని విధాలుగా మద్దతు అందిస్తోంది. ట్రామా నుంచి కోలుకునేందుకు సామాజిక మద్దతు, వైద్య సహాయం, కౌన్సెలింగ్ వంటి సేవలు అందజేస్తోంది. ఇప్పటి వరకూ ఆర్‌సీఐ ద్వారా 10వేల కంటే ఎక్కువ మంది పిల్లలను రక్షించి వారికి ఆశ్రయం కల్పించారు.



## విరాళాలే ఆధారం

కానీ "నిధుల కొరత వల్ల ఇంకా చాలామంది పిల్లలను మేం రక్షించలేకపోతున్నాం' అని ముల్లిక్ అంటున్నారు. ఆర్‌సీఐ ఈ పిల్లలను త్వరగా చేరుకోవడం కోసం నిధుల అవసరం చాలా ఉంది, ఎందుకంటే వారిని ఆపద నుంచి కాపాడటానికి తగినంత సహాయం అవసరం. ఈ సంక్షోభాన్ని ఆర్‌సీఐ ఒంటరిగా ఎదుర్కోలేదు. వీటికి వినియోగం లక్షల్లో ఉంటే, ప్రతి సంవత్సరం విరాళాలపై ఆధారపడుతూ వారి సేవలను కొనసాగిస్తోంది. ఇంకా ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నప్పటికీ, మన సహాయం ఇంకా అవసరం అంటున్నారు ముల్లిక్. మీ సహాయం వేలాది మంది పిల్లలకు భద్రత, వైద్య సహాయం, జీవన పునరుద్ధరణ అవకాశాన్ని కల్పించగలదు. భారతదేశంలో కుటుంబాలకు దూరం అయిన పిల్లలకు ఒక సురక్షిత ఆశ్రయం ఇచ్చేందుకు మనం కలిసి ప్రయత్నించవచ్చు. మీకు తోచినంత సాయం చేసి మంచి పనిలో చేయి కలపండి. మనం ఈరోజు సాయం చేస్తేనే మన కోసం ఒకరోజు ముందుకువస్తారు.



అలాగే పిల్లలతో బయటకు వెళ్లేప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఒక్క క్షణం కూడా వారిని విడిచి ఉండకూడదు. రైల్వేస్టేషన్లలో పిల్లలను కిడ్నాప్ చేసే అవకాశం కూడా ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ముందే మీ పిల్లలకు కొన్ని సూచనలు చేయండి. అపరిచితుల దగ్గరకు వెళ్లకూడదని, వారు ఏదైనా తినడానికి ఇస్తే తీసుకోకూడదని ఇలా చెప్పండి. మనం జాగ్రత్తగా ఉందాం. పిల్లలను సంరక్షించుకుందాం.

- సత్యం ఐటీ డెస్క్

---




కొన్నేళ్లుగా సరైన విజయాలు లేక ఇబ్బంది పడుతున్న యువ కథానాయకుడు వరుణ్ తేజ్.. 'పలాస' ఫేమ్ కరుణ్ కుమార్ దర్శకత్వంలో నటించిన చిత్రం.. మట్కా. ప్రోమోలు చూస్తే హిట్టు కోసం వరుణ్ నిరీక్షణకు తెరదించేలా కనిపించిందీ సినిమా. మరి 'మట్కా' ఆ అంచనాలను నిజం చేసిందా? తెలుసుకుందాం పదండి.

# తిరగబడ్డ జూదం!

**కథ:** వాసు దేవ్ అలియాస్ వాసు (వరుణ్ తేజ్) ఓ శరణార్థి గా తల్లితో కలిసి విశాఖపట్నానికి వస్తాడు. కొబ్బరికాయల వ్యాపారం చేసే ఓ వ్యక్తి దగ్గర పని కోసం చేరిన అతను.. తన యజమానిని ఓ సమస్య నుంచి బయటపడేయడంతో ఆ వ్యాపారంలో వాటాదారుగా మారతాడు. ఆపై నాని బాబు అనే (కిషోర్) పెద్ద మనిషి అండతో మరింత ఎదుగుతాడు. ఐతే పెద్ద వ్యాపారం చేసి ఇంకా పై స్థాయికి వెళ్లాలని చూస్తున్న అతడికి మట్కా మార్గంగా కనిపిస్తుంది. ఈ జూదాన్ని వినూత్న రీతిలో నిర్వహిం చడం ద్వారా ఎవ్వరూ ఊహించనంత డబ్బు సంపాదిస్తాడు. దేశంలోనే పేరుమోసిన మట్కా కింగ్ అవుతాడు. కానీ ఇక ఎదురు లేదనుకున్న దశలో వాసుకు ఊహించని ఇబ్బందులు మొదలవుతాయి. ఆ ఇబ్బందులేంటి.. వాటిని అతను అధిగమించాడా లేదా.. చివరికి వాసు జీవితం ఏ మజిలీకి చేరింది అన్నది మిగతా కథ.

**నటీనటులు:** వరుణ్ తేజ్ తన కెరీర్లో చెప్పుదకోదగ్గ పాత్రల్లో ఇదొకటిగా నిలుస్తుంది. పెద్ద జర్నీ ఉన్న క్యారెక్టర్ చేశాడిందులో. వేర్వేరు వయసులకు తగ్గట్లుగా లుక్ మార్చుకోవడమే కాదు.. ఆయా సమయాలకు తగ్గట్లుగా వ్యవహార శైలిని కూడా మారుస్తూ డిఫరెంట్ షేడ్స్ చూపించాడు. వయసు పెరిగే కొద్దీ వచ్చే పరిణతిని పాత్రలో చూపించిన విధానం ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా తన నేపథ్యం గురించి ఒక పిట్ట కథ రూపంలో చెప్పే ఓ సన్నివేశంలో వరుణ్ నటన స్టాండౌట్ గా నిలుస్తుంది. హీరోయిన్ మీనాక్షి చౌదరి.. 'లక్కీ భాస్కర్' తరహాలో హౌస్వైఫ్ క్యారెక్టర్ పాత్రలో కనిపించింది. కానీ ఆమె పాత్ర పరిధి తక్కువ. పెద్దగా నటించే అవకాశం రాలేదు. తన కంటే నోరా ఫతేహి పాత్రకే కొంచెం ప్రాధాన్యం ఉంది. ఇప్పటిదాకా ఐటెం సాంగ్స్ లో మాత్రమే చూసిన ఆమెను ఇలాంటి పాత్రలో చూడడం కొత్తగా అనిపిస్తుంది. తన పెర్ఫామెన్స్ ఓకే. విలన్ పాత్రలో జాన్ విజయ్ రొటీన్ గా అనిపిస్తాడు. కిషోర్ పర్వాలేదు. నవీన్ చంద్ర తన పాత్రలో రాణించాడు. సలోని.. అజయ్ ఘోష్.. సత్యం రాజేష్.. వీళ్లంతా బాగానే చేశారు.

**సాంకేతిక వర్గం:** జి.వి.ప్రకాష్ కుమార్ సంగీతం డిఫరెంట్ స్టయిల్లో సాగింది. కానీ అది అందరికీ రుచించేలా మాత్రం లేదు. సినిమా శైలికి తగ్గట్లు సటిల్ గా సాగే మ్యూజిక్ ఇచ్చాడతను. చార్ట్ బస్టర్ అనిపించే పాట ఏదీ లేదు. పాటలు ఏదో అలా సాగిపోతాయి. నేపథ్య సంగీతం ఓ మోస్తరుగా అనిపిస్తుంది. కిషోర్ కుమార్ ఛాయాగ్రహణం బాగుంది. విజువల్స్ ఆకట్టుకుంటాయి. నిర్మాణ విలువలు సినిమాకు అవసరమైన స్థాయిలో ఉన్నాయి. దశాబ్దాల కిందటి వాతావరణాన్ని తెరపై బాగానే చూపించారు. కరుణ్ కుమార్ డైలాగ్స్ వరకు వారెవా అనిపించాడు. "ఆశను అమ్ముతాం.. నమ్మకాన్ని కొంటాం" లాంటి డైలాగుల్లో చూపించిన లోతును సినిమాలో చూపించలేకపోయాడు కరుణ్ కుమార్. కానీ ఆయన ఎంచుకున్న కథే చాలా రొటీన్. నరేషన్లో కొంచెం వైవిధ్యం చూపించినా.. గొప్ప మలుపులేమీ కనిపించకపోవడం.. ప్రేక్షకులకు హై ఇచ్చే ఎపిసోడ్లు ఆశించిన స్థాయిలో లేకపోవడం నిరాశ తప్పదు.

**కథనం-విశ్లేషణ:**

ప్రపంచ సినిమా చరిత్రలోనే అత్యధికంగా ప్రభావం చూపిన చిత్రాల్లో 'గాడ్ ఫాదర్' ఒకటిగా చెబుతారు. వివిధ దేశాల్లో.. భాషల్లో ఎంతోమంది దర్శకులు ఆ కథ నుంచి స్ఫూర్తి పొంది.. తమదైన శైలిలో కథనాన్ని జోడించి దశాబ్దాల నుంచి 'గాడ్ ఫాదర్' వెర్షన్లు తీస్తూనే ఉన్నారు. సామాన్యుడిగా మొదలుపెట్టి ఒక పెద్ద సామ్రాజ్యాన్ని నిర్మించే వ్యక్తుల కథలను ఎన్నిసార్లయినా చూపించొచ్చు. కానీ దీనికి జోడించే నేపథ్యం కొంచెం కొత్తగా అనిపించాలి.. అలాగే ఆసక్తికర కథనం తోడవ్వాలి. 'మట్కా' సినిమా కోసం తెలుగు తెరపై ఇప్పటిదాకా చూడని మట్కా అనే జూదాన్ని నేపథ్యంగా తీసుకోవడం బాగానే ఉంది. కానీ ఈ కొత్త విషయాన్ని ఆసక్తికరంగా చూపించడంలో కానీ.. అలాగే వాసు అనే వ్యక్తి జీవితాన్ని రసవత్తరంగా ప్రెజెంట్ చేయడంలో కానీ.. కరుణ్ కుమార్ సక్సెస్ కాలేకపోయాడు. పలాస.. శ్రీదేవి సోడా సెంటర్ చిత్రాలతో తన అభిరుచిని చాటుకున్న కరుణ్ కుమార్.. ఈసారి మాస్ స్టయిల్లో కథను ప్రెజెంట్ చేయాలని చూశాడు కానీ.. అది సరిగా కుదరలేదు. మట్కా కాన్సెప్ట్ బాగున్నా.. దాన్ని ప్రెజెంట్ చేయడంలో తడబాటు.. ప్రేక్షకులను ఎక్కడా ఆశ్చర్యపరచని విధంగా రొటీన్ గా సాగిపోయే కథ.. మరీ డల్లుగా సాగే నరేషన్ 'మట్కా'కు ప్రతిబంధకాలుగా మారాయి. కరుణ్ కుమార్ డైలాగుల్లో చూపించిన పెన్‌పవర్‌ను కథాకథనాల్లో చూపించకపోవడం కూడా పెద్ద మైనస్ అయింది.

జీవితంలో గట్టి ఎదురు దెబ్బ తిన్న కుర్రాడు.. కొత్తగా తన ప్రయాణాన్ని మొదలు పెట్టి అంచెలంచెలుగా ఎదిగే కథలు తరచుగా చూస్తూనే ఉంటాం. ఇది రెగ్యులర్ ఫార్మాటే అయినా.. ఆ జర్నీని ఎంత ఆసక్తికరంగా చూపించారు అన్నది ముఖ్యం. 'కేజీఎఫ్'లో అయినా.. 'పుష్ప'లో అయినా ఇలాంటి జర్నీనే చూపించినా.. అందులో పేలిపోయే ఎలివేషన్లు.. రసవత్తరమైన ఎపిసోడ్లు పెట్టి ప్రేక్షకులను ఎంగేజ్ చేశారు దర్శకులు. కానీ 'మట్కా'లో అవే మిస్ అయ్యాయి. కరుణ్ కుమార్ హీరోను ఎలివేట్ చేయడానికి కొన్ని ఎపిసోడ్లు పెట్టాడు కానీ.. అవి అంతగా పేలలేదు. ఒక ఫైట్ చేసి హీరో అయిపోవడం.. ఒకరి దగ్గర పనికి చేరి తనకే యజమాని అయిపోవడం లాంటి సన్నివేశాలు చాలా రొటీన్ అనిపిస్తాయి. హీరో ప్రేమ వ్యవహారం కానీ.. తన ఎదుగుదలకు సంబంధించిన అంశాలు కానీ ఏవీ కొత్తగా అనిపించవు. ఏవో సన్నివేశాలు వస్తుంటాయి పోతుంటాయి తప్ప.. అబ్బురపడేంతగా ఏమీ జరగదు తన జీవితంలో. మరీ నెమ్మదిగా సాగే సన్నివేశాలు ప్రేక్షకుల సహనానికి పరీక్ష పెడతాయి. మట్కా కాన్సెప్ట్ పరిచయం అయ్యే వరకు సినిమాలో అసలు కొత్తగా అనిపించే.. ప్రేక్షకుల ఆసక్తిని రాబట్టే అంశం ఏదీ లేదు. మట్కా గురించి పరిచయం చేసే సన్నివేశాలు ప్రేక్షకుల అటెన్షన్ రాబడతాయి. కానీ తర్వాత మళ్లీ మామూలే.

హీరో ఎదుగుదల.. నమ్మక ద్రోహం.. తన పతనం.. తిరిగి ప్రతీకారం.. ఇలా ఒక మూసలో సాగిపోతుంది 'మట్కా'. కరుణ్ కుమార్ నరేషన్ అంతకంతకూ డల్ అయిపోవడంతో సినిమా ఎప్పుడు ముగుస్తుందా అనే ఫీలింగ్ లోకి వెళ్లిపోతారు ప్రేక్షకులు. అక్కడక్కడా డైలాగులు కొన్ని పేలుతాయి తప్ప.. సన్నివేశాల్లో మాత్రం ఏ మజా ఉండదు. అసలు ఏం ప్రత్యేకత ఉందని ఈ కథతో సినిమా చేశారనే ప్రశ్నలు రేకెత్తిస్తుంది 'మట్కా'. 60, 70, 80 దశకాల్లోని పరిస్థితులను బాగా చూపించినా.. నిర్మాణ విలువలు బాగున్నా.. ఈ కథకు తగ్గ సెటప్ కుదిరినా.. సరైన మూడ్ సెట్ చేయగలిగినా.. వరుణ్ తేజ్ సహా ఆర్టిస్టుల పెర్ఫామెన్స్ బాగున్నా.. మట్కా నేపథ్యం మినహాయిస్తే కథలో కొత్తదనం కనిపించకపోవడం.. డల్ నరేషన్.. రొటీన్ సన్నివేశాలు.. 'మట్కా' మీద ఆసక్తిని అంతకంతకూ తగ్గించేస్తాయి. అసలే స్లో నరేషన్.. పైగా నిడివి బాగా ఎక్కువైపోవడంతో సినిమా ముగిసేసరికి నిట్టూర్పు తప్పదు. కరుణ్ కుమార్ గత సినిమాలను దృష్టిలో ఉంచుకుని ఒక అభిరుచితో సినిమా చూద్దామనుకున్న వాళ్లకు కూడా 'మట్కా' నీరసమే తెప్పిస్తుంది. మట్కా కాన్సెప్ట్.. కొన్ని డైలాగులు.. వరుణ్ తేజ్ పెర్ఫామెన్స్ మినహాయిస్తే 'మట్కా'లో చెప్పుకోదగ్గ అంశాలు లేవు.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...

# మరింత పట్టుకు బీజేపీ యత్నం!





* బీజేపీ మూడోసారి కూడా కేంద్రంలో గద్దెనెక్కాక.. తనకనుకూలంగా మారుతున్న రాష్ట్రాలపై మరింత పట్టు బిగించాలని చూస్తోంది. ముఖ్యంగా జాతీయస్థాయిలో తనకు పోటీగా నిలుస్తుందనుకునే కాంగ్రెస్‌ను, ఆయా రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీలను సమర్థవంతంగా ఎదుర్కొని అధికారంలోకి రావడమే కాదు.. పాతుకుపోవాలనే సంకల్పాన్ని తీసుకున్నట్టు కనిపిస్తోంది. తాజాగా ఒడిశా ఎపిసోడ్ అలాంటి చర్చకు తెరలేపింది.
* ఒడిశాలో గత ఎన్నికల్లో బీజేపీ గద్దెనెక్కింది సరేసరి. కానీ, ఈ ఒక్కసారి ఓటమిపాలైనంత మాత్రం బిజూ జనతాదళ్‌ను తక్కువ అంచనా వేసే పరిస్థితేం ఉండదు. నవీన్ పట్నాయక్‌కు ముదిమితనం వచ్చినంత మాత్రాన ఇంకెవరో రాకపోరు. ఎవరు కాస్త గట్టి సంకల్పంతో వచ్చినా బలంగా నిల్చుకోగల్గే పునాదులున్న ప్రాంతీయ పార్టీ బీజేడీ. సో, ఈ క్రమంలో దానికి ఆ ఛాన్స్ ఇవ్వొద్దంటే.. అలాగే, జాతీయ స్థాయిలోనూ, పలు రాష్ట్రాల్లోనూ తనకు ప్రధాన ప్రత్యర్థిగా ఉన్న కాంగ్రెస్‌కూ ఛాన్స్ ఇవ్వొద్దంటే ఏంచేయాలనే దానిపై బీజేపీ దృష్టి సారించినట్టు కనిపిస్తోంది.
* అందులో భాగంగా ఒడిశా వాస్తుశిల్పిగా పేరొందిన మాజీ ముఖ్యమంత్రి హరేకృష్ణ మహతాబ్ 125 జయంతి వేడుకలపై బీజేపీ దృష్టి పెట్టింది. ఒడిశా ఐకాన్‌గా ఉన్న హరేకృష్ణ మహతాబ్ వంటివారిని ఎత్తుకుని తమ పార్టీ తరఫున క్లెయిమ్ చేసుకుంటే.. అక్కడ ఇప్పటికే అధికారం కట్టబెట్టిన ప్రజాదరణను ఇంకా పెంచుకోవడంతో పాటు మరింత శాశ్వతం చేసుకోవచ్చన్న ఉద్దేశమూ ఇందులో లేకపోలేదన్నది ఇప్పుడు జరుగుతున్న చర్చ.

ఒడిశా అస్తిత్వానికి, హరేకృష్ణ మహతాబ్ జయంతి వేడుకలతో ముడిపెట్టి.. సెంటిమెంటల్‌గా బీజేపీని ఒడిశాలో మరింత స్ట్రాంగ్‌గా మార్చడమే ఈ వ్యూహంలో భాగమనేవారూ లేకపోలేదు. అదే సమయంలో ఎమర్జెన్సీ సమయంలో ఇందిరను వ్యతిరేకించి జైలుపాలైన **హరేకృష్ణ మహతాబ్ కథ**ను మరోసారి ముందరికి తెస్తున్నారు. మహతాబ్‌ను ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీతో పాటు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కూడా గొప్ప జాతీయవాదిగా కొనియాడుతూ.. ఆయన వారసత్వాన్ని బీజేపీ కొనసాగిస్తుందనే సంకేతాలిస్తున్నారు.

### అసలెవరు హరేకృష్ణ మహతాబ్..?

మహతాబ్ స్వాతంత్ర్య సమరయోధుడు, మంచి రచయిత, ఆధునిక ఒడిశా వాస్తుశిల్పుల్లో ఒకడిగా ఐకానిక్ పేరు గలవాడు. 1899, నవంబర్ 21న భద్రక్ (అప్పటి బాలాసోర్) జిల్లా అగడపరలో కృష్ణచరణ్ దాస్, తోఫా బీబీ దంపతులకు జన్మించాడు. కానీ, అగర్పద మహారాజైన తన తాత జగన్నాథ్ మహతాబ్, ఆయన భార్య రాణి ధనిబీబీ అతణ్ని పెంపకంతీసుకున్నారు.

1918లో హరేకృష్ణ మహతాబ్ ఉత్కల్ సమ్మిళనీ అనే సాంఘిక, సాంస్కృతిక సంస్థలో చేరాడు. 1903లో సామాజిక సంస్కర్త మధుసూదన్ దాస్ ఈ ఆర్గనైజేషన్‌ను స్థాపించారు. ఈ సంస్థ ఒడిశా ప్రత్యేక ప్రావిన్స్‌గా ఏర్పాటు కావాలని, సామాజిక, పారిశ్రామికాభివృద్ధి జరగాలని బలంగా ప్రచారం చేస్తున్న రోజులవి.

1920లో మహాత్మాగాంధీ సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ప్రారంభించినప్పుడు ఉత్కల్ సమ్మిళనీ సంస్థ కూడా ఆయనతో కలిసి అడుగులు వేయాలని నిర్ణయించుకుంది. అదే సమయంలో, కటక్‌లో రావెన్ షా కళాశాల విద్యార్థిగా ఉన్న మహతాబ్.. మహాత్మా గాంధీ భావాలతో అమితంగా ప్రభావితమయ్యారు. అలా స్వాతంత్ర్య పోరాటంలోకి దిగిన మహతాబ్.. ఆ తర్వాత బ్రిటీషర్స్‌ను ఎదిరించి పలుమార్లు జైలుపాలయ్యారు.

మహతాబ్ ఉత్కల్‌ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీతో పాటు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలోనూ పలు పదవులు చేపట్టారు. 1920లో ఒడిశాలో ప్రజామండల్ ఉద్యమానికి నాయకత్వం వహించారు. స్థానికంగా బ్రిటీష్ వారి సామంతులుగా ఉన్న ప్రభువులకు, పరోక్షంగా బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా చేపట్టిన ఈ ఉద్యమాన్ని గడ్జత్ ప్రజా ఉద్యమని కూడా పిల్చేవారు.

అలా రాజకీయాల్లో చురుకుగా వ్యవరించిన హరేకృష్ణ మహతాబ్.. మరికొద్ది రోజుల్లో స్వాతంత్ర్యం సిద్ధిస్తుందనే సమయంలో రాజ్యాంగ సభకు ఎన్నికయ్యారు. 1946-50 మధ్య ఒడిశా చివరి ప్రధానమంత్రిగా ఉన్న హరేకృష్ణ మహతాబ్.. ఆ తర్వాత 1956 నుంచి 1961 వరకు ఒడిశా ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఒడియా మాట్లాడే 26 రాచరిక పాలనలో ఉన్న రాష్ట్రాలన్నింటినీ ఒడిశాతో విలీనం చేసిన ఘనత ముఖ్యమంత్రిగా హరేకృష్ణ మహతాబ్‌ది. ఒడిశాలోని మహానదిపై హీరాకుడ్ ప్రాజెక్టుతో సహా ఎన్నో మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఆ రాష్ట్రానికే ఓ మార్గదర్శకుడిగా నిల్చాడు.

జవహర్ లాల్ నెహ్రూ మొట్టమొదటి కేంద్ర కేబినెట్‌లో సభ్యుడైన మహతాబ్.. 1955లో బొంబాయి ప్రావిన్స్ గవర్నర్‌గా కూడా పని చేశారు. 1966లో మహతాబ్ భారత జాతీయ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా కూడా పగ్గాలు చేపట్టే స్థాయికి ఎదిగారు. కానీ, లాల్ బహదూర్ శాస్త్రి మరణానంతరం ప్రధానమంత్రి ఇందిరాగాంధీతో విధానపరమైన విభేధాలేర్పడ్డాయి. దాంతో మహతాబ్ కాంగ్రెస్‌ను విడిచిపెట్టి.. తన సొంత పార్టీ ఒరిస్సా జన కాంగ్రెస్‌ను స్థాపించారు. ఆ తర్వాత తను మూడుసార్లు ఒడిశా శాసనసభకు ఎన్నికయ్యారు. ఇందిర ఎమర్జెన్సీని వ్యతిరేకించినందుకు 1976లో జైలు పాలయ్యారు.

1977లో క్రియాశీల రాజకీయాల నుంచి విరమణ తీసుకున్న మహతాబ్.. 1987, జనవరి 2న కన్నుమూశారు. 1923లో ఆయన స్థాపించిన ప్రజాతంత్ర అనే వార్తాపత్రిక ఇప్పటికీ ఒడిశాలో ఉనికిలో చురుకుగా ఉంది. కటక్ నుంచి బీజేపీ ఎంపీగా గెల్చిన ఆయన కుమారుడు భర్తృహరి ఆ ప్రజాతంత్రకు సంపాదకుడిగా ఉన్నారు.

### బలమైన రాజకీయ ముద్ర కోసం యత్నం

బహుశా ఇందిరాగాంధీపై తిరుగుబాటు చేసినందుకో, ఏమోగానీ నాలుగు దశాబ్దాలకు పైగా ఒడిశాను పాలించిన కాంగ్రెస్ నుంచి హరేకృష్ణ మహతాబ్‌కు దక్కాల్సినంత గౌరవం దక్కలేదు. కానీ 13 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన జానకీ వల్లభ్ పట్నాయక్‌ను మాత్రం కాంగ్రెస్ భుజానికెత్తుకుంది. దాంతో ఒడిశాలో కాంగ్రెస్ అత్యున్నత నేతగా జానకీ వల్లభ్ పట్నాయక్‌కు పేరు వచ్చింది.

1997లో నవీన్ పట్నాయక్ బిజూ జనతాదళ్‌ను స్థాపించి.. 2000 సంవత్సరంలో ముఖ్యమంత్రి పీఠమెక్కాక ఒడిశా రాజకీయ ముఖచిత్రమే మారిపోయింది. 24 ఏళ్ల పాటు బీజేడీ ప్రభుత్వం అధికారంలో ఉండి.. ఒడిశాలో తిరుగులేని పార్టీగా ఎదిగింది. తన తండ్రి బిజూ పట్నాయక్ ఇమేజ్‌ను మరింత పెంచుతూ నవీన్ పట్నాయక్ పాలన సాగించారు. ఈ కాలంలో బిజూపట్నాయక్‌ను ఒడిశా ఆధునిక శిల్పిగా అభివర్ణిస్తూ ఆయన విగ్రహాలు వెలవడంతో ఇక హరేకృష్ణ మహతాబ్ పేరే మర్చిపోయేలా, కొత్త తరానికైతే ఎవరో తెలియని నాయకుడిగా మారిపోయింది పరిస్థితి. కేవలం ఒడిశా అసెంబ్లీతో పాటు, భువనేశ్వర్‌లోని స్టేట్ లైబ్రరీలో మాత్రమే మహతాబ్ విగ్రహాలు దర్శనమిస్తాయి.

అయితే, ఇప్పుడు హరేకృష్ణ మహతాబ్ 125 జయంతి వేడుకలు వస్తున్న సందర్భంగా బహుశా ఇందిరాగాంధీ ఎమర్జెన్సీపై విభేదించడం, మహతాబ్‌లాగే ఇందిరపై

## ఒడిశా ఎపిసోడ్ ఏం చెబుతోంది..?

తిరుగుబాటు చేసిన నాటి జనతాదళ్‌లో ఉండి ఆ తర్వాత బీజేపీ బాట పట్టిన సీనియర్ నేతలను జైలుపాలు చేయడం, ఒడిశా నవ నిర్మాణ శిల్పిగా పేరున్న ఆయన్ను సముచితంగా గౌరవించడంలేదన్న అంశాలన్నింటినీ ప్రజల్లోకి తీసుకెళ్లి, మహతాబ్ వారసులుగా బీజేపీ క్లెయిమ్ చేసుకునే అవకాశాలు బీజేపీ నేతల అడుగులను బట్టి చర్చకొస్తున్నాయి. బీజేడీ నుంచి ప్రాతినిధ్యం వహించి ఆరుసార్లు ఎంపీ అయిన హరేకృష్ణ మహతాబ్ కుమారుడు భర్తృహరిని గత పార్లమెంట్ ఎన్నికలకు ముందు గాలం వేసి బీజేపీ తనవైపు లాక్కోవడంలో సక్సెసైంది. భర్తృహరి 1998 నుంచి వరుసగా కటక్ లోక్‌సభ సభ్యుడిగా గెలుస్తూ వస్తున్నారు.

ఇప్పుడు మహతాబ్ 125వ జన్మదినాన్ని పురస్కరించుకుని మాఝీ ప్రభుత్వం ఆయన పేరిట ఒక స్మారక మ్యూజియాన్ని ఏర్పాటు చేసి ఆయన జన్మస్థలమైన అగరపడాలో ఆయన విగ్రహాన్నీ ఏర్పాటుచేసి దాన్నో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న సంకల్పాన్ని తీసుకుంది. అలాగే, మహతాబ్ రాజకీయ జీవితంపై సెమినార్స్ నిర్వహించాలని, ఆయనకు సంబంధించిన పరిశోధనలను ప్రోత్సహించాలనే ప్రణాళికలతో పాటు ఆయన రచించిన పుస్తకాలను హిందీ, ఇంగ్లీష్, ఇతర భాషల్లోకి అనువదించి, వాటిని అన్ని విశ్వవిద్యాలయాల్లోనూ ఉంచే అన్ని ప్రయత్నాలూ ఇప్పుడు బీజేపీ భుజానికెత్తుకునేందుకోవడంతో ఒడిశాలో బలపడేందుకు బీజేపీ అనుసరిస్తున్న వ్యూహాలు చర్చకొస్తున్నాయి.



- రమణ కొంటికర్ల



# కలబడితే పతనం.. కలిసి కదిలితే అగ్రస్థానం.. అదే మస్క్ సూత్రం..!

మన దేశంలో 'కొందరు' అంబానీ, అదానీ, బిర్లా వంటి ప్రముఖ వ్యాపారవేత్తల మీద పడి ఏడుస్తూ ఉంటారు. అంబానీ తన చిన్న కొడుకు పెళ్లికి బిల్‌గేట్స్‌ని పిలిచి అత్యంత ఖర్చుతో వేడుక జరిపితే చూడలేరు. ఇలానే, అమెరికాలో కూడా ఇలాన్ మస్క్ వంటి వ్యాపారవేత్తల ఎదుగుదలపై కొందరు అసూయతో ఉంటారు, ఏడుస్తూ ఉంటారు. ప్రపంచంలో ప్రతిచోటా ఇలా వేరే వాళ్ల మీద ఏడ్చేవాళ్లు ఉంటారు. వారి దృష్టిలో, ఈ ప్రముఖుల, వ్యాపారవేత్తల ఎదుగుదలకు ప్రభుత్వంలోని పెద్దల సహకారమే ప్రధాన కారణం అన్నది ఒక అభిప్రాయం.

కానీ, వారి ఎదుగుదలకు ప్రధాన కారణం వారి ఆలోచనా విధానం. ఉదాహరణకు, ఇలాన్ మస్క్ టెస్లా సంస్థ అధినేతగా ఎలక్ట్రిక్ కార్లను ప్రపంచ వ్యాప్తంగా తీసుకెళ్లాలనే లక్ష్యంతో ఉన్నాడు. కానీ, అతని వద్ద ఎక్కువ కార్ల ఉత్పత్తి సామర్థ్యం లేదు. ఈ నేపథ్యంలో, మస్క్ ఫోర్డ్ కంపెనీకి వెళ్లి, 'నా వద్ద ఉన్న టెక్నాలజీని మీకు అందిస్తా, మీ తయారీ సామర్థ్యాన్ని నా ప్రాజెక్టు కోసం ఉపయోగించుకుంటా, ఇద్దరికీ లాభం' అంటూ ఒక వ్యూహాత్మక ప్రతిపాదన చేశాడు. దాంతో ఇప్పుడు ఇద్దరూ కలిసి అమెరికాలో అత్యుత్తమ స్థాయికి చేరుకుంటున్నారు. ఇదే నిజమైన ఎదుగుదలకి ముఖ్య సూత్రం. ఫోర్డ్ కంపెనీకి అమెరికాలో ఘనమైన చరిత్ర ఉంది. ఒక అమెరికన్ ఏ దేశానికైనా వెళ్లినా అక్కడ ఫోర్డ్ కార్లు కనిపిస్తాయా అని చూస్తాడు. అమెరికా జాతీయవాదులు కూడా ఫోర్డ్ కార్లనే ఎక్కువ ఉపయోగిస్తారు. అయితే, ప్రస్తుత పోటీ వాతావరణంలో ఫోర్డ్ కొంత వెనుకబడింది. ప్రధాన పోటీదారుగా టెస్లా నిలబడింది. ప్రస్తుతం ఫోర్డ్స్ కంపెనీ నష్టాల్లో ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో మనం అయితే ఫోర్డ్‌ను పూర్తిగా ఓడించి, సర్వ నాశనం చేసి మనం సులభంగా ఎదగాలని అనుకుంటాం. కానీ, ఇలాన్ మస్క్ ఆ దిశలో ఆలోచించలేదు. కలిసి ఎదుగుదాం అన్నాడు. ధనవంతులే కాదు, ఇద్దరు అడుక్కుతినేవాళ్లు కూడా ఒకరికొకరు సహాయం చేసుకుంటే కలిసి ఎదగవచ్చు అని ఒక రోమన్ తత్వవేత్త అంటాడు. అతను తన అనుభవంలో నేర్చుకున్న విషయాలు ఇవతల వ్యక్తికి, ఇతని అనుభవం అతనితో షేర్ చేసుకుంటే ఇద్దరూ మరింత మెరుగ్గా అడుక్కుని అత్యంత విజయంగా బతకవచ్చు. సెకండ్ జనరేషన్, థర్డ్ జనరేషన్ పిల్లలు సహజంగానే ఎదుగుతారు, ఎందుకంటే వారికి తల్లిదండ్రుల సహకారం, వాళ్ల వర్గం నెట్‌వర్క్, మద్దతు ఉంటుంది. కానీ, ఫస్ట్ జనరేషన్ వారికి తెలివితేటలు, కష్టపడే మనస్తత్వం ఉన్నప్పటికీ గైడెన్స్ లేకపోవడం వల్ల ఎదగాల్సినంత ఎక్కువ ఎదగలేరు. అందుకే, తమలాంటి ఆలోచన కలిగిన వారితో కలిసి ఒకరికి ఒకరు సాయం చేసుకుంటే, ఇద్దరూ కలిసి ఎదగవచ్చని పెద్దలు చెబుతారు. ఇంకో ఉదాహరణ, శ్రీ చైతన్య - నారాయణ. అప్పట్లో ఇద్దరి మధ్య ఎంత పోటీ ఉందో మనకు తెలుసు. కానీ వీడు వాడ్ని, వాడు వీడ్ని లేపేయాలనుకోలేదు. ఇద్దరూ కలిసి జనాలని పిచ్చోళ్లని చేసి కోటానుకోట్లు సంపాదించారు. మళ్లీ టెస్లా, ఫోర్డ్ విషయానికి వస్తే - టెస్లా తమ ఎలక్ట్రిక్ కార్లకి చార్జర్ యూనిట్లని ప్రతి చోటా పెట్టాలి అంటే చాలా ఖర్చవుతుంది. ఫోర్డ్ వాళ్లకి కూడా విడిగా తమ ఎలక్ట్రిక్ కార్లకి చార్జర్ యూనిట్లని పెట్టాలి అంటే తమ స్థాయికి మించిన ఖర్చు చేయాల్సి ఉంటుంది. అదే ఇద్దరూ కలిసిపోయి కంబైండ్ చార్జర్ యూనిట్లని పెడితే తక్కువ ఖర్చుతో ప్రపంచంలో ఎలక్ట్రిక్ కార్లలో కలిసి ఎదగవచ్చు, ప్రపంచంలో ఎక్కువ ఎలక్ట్రిక్ మార్కెట్ సొంతం చేసుకోవచ్చు. ఒక్కటి మాత్రం నిజం. మనం ఎదిగినా మనమే కారణం, మనం ఓడిపోయి సంకనాకిపోయినా మన ఆలోచనలు, మనమే కారణం. పనికిరాని వాళ్లే వేరే వాళ్ల మీద ఏడుస్తూ ఉంటారు అంటాడు ఒక రోమన్ తత్వవేత్త.

– జగన్నాథ్ గౌడ్ (పూర్తి వ్యక్తిగత అభిప్రాయం)

## స్కౌట్స్ & గౌడ్స్ సేవలు ప్రశంసనీయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కోటబొమ్మాళి శ్రీ కొత్తమ్మ తల్లి అమ్మవారి ఉత్సవాల్లో పోలీసు సిబ్బందితో పాటు స్వచ్ఛందంగా సేవలు అందించిన హిందుస్థాన్ స్కౌట్స్ & గైడ్స్ సేవలు ప్రశంసనీయమని ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. కొత్తమ్మ తల్లి ఉత్సవాల్లో సామాన్య భక్తుల దర్శనానికి ఎటువంటి ఆటంకం లేకుండా క్యూలైన్లు, క్రమ పద్ధతుల నిర్వహణ, పోలీస్ సిబ్బందితో పాటు బందోబస్తులో భక్తులకు స్వచ్ఛందంగా సేవలందించి, పోలీస్ సిబ్బందికి ప్రత్యక్షంగా సహాయ సహకారాలు అందించారని కొనియాడారు. గురువారం హిందుస్థాన్ స్కౌట్ & గైడ్స్ సిబ్బందిని ఎస్పీ జిల్లా పోలీస్ కార్యాలయానికి పిలిపించి ప్రత్యేకంగా అభినందించి ప్రశంస పత్రా



లను అందజేశారు. జిల్లాలో జరగనున్న అరసవల్లి, శ్రీముఖలింగం బందోబస్తుల్లో కూడా స్వచ్ఛందంగా సేవలు అందించాలని హిందుస్థాన్ స్కౌట్స్ & గైడ్స్ నిర్వాహకులను ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్బి సీఐ ఇమ్మాన్యువల్ రాజు, హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ఆర్గనైజర్ కమిషనర్ కె.నాగేంద్ర, జిల్లా కమిషనర్ ఎం.జగదీశ్వరరావు, ఇతర సభ్యులు ఉన్నారు.

## ఏఎస్ఐ కుమారునికి కారుణ్య నియామకం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కవిటి పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో గత ఏడాది మరణించిన డి.భాస్కరరావు కుమారుడు సాయిరాముకు కారుణ్య నియామకం ప్రకారం విజయనగరం జిల్లా పోలీసు కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం కల్పిస్తూ నియామక పత్రాన్ని ఎస్పీ కేవీ మహేశ్వర్‌రెడ్డి గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్రమశిక్షణ, అంకితభావంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని, వృత్తి నైపుణ్యం పెంచుకొని అప్పగించిన విధులను సమర్థవంతంగా నిర్వహించి అధికారుల మన్ననలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు కార్యాలయం ఓవో సీహెచ్ గోపినాథ్, ఎస్బి సీసీ బి.వి.శివప్రసాద్ ఉన్నారు.
















# బాలియాత్ర విజయవంతం చేయండి



(సత్యంన్యూస్, నరసన్నపేట)

ప్రాచీన కళింగ సంప్రదాయమైన బాలియాత్ర పునఃప్రారంభం కానున్న దృష్ట్యా ఈ యాత్ర విజయవంతానికి అందరూ కృషి చేయాలని వైకాపా టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేరాడ తిలక్ పిలుపునిచ్చారు. ఈ నెల 17న మధ్యాహ్నం 2 గంటలకు పూర్వ కళింగ రాజధాని శ్రీముఖలింగం దేవాలయం వద్ద ప్రారంభమై వంశధార నదీ తీరాన ఘాట్ వద్ద తెప్పోత్సవం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా యాత్ర నిర్వహణపై శ్రీముఖలింగం గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, పురోహితులతో తిలక్, డాక్టర్ జీవితేశ్వరరావులు గురువారం సమీక్షించారు. నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, వైకాపా నాయకులు అన్నెపు రామారావు, సత్తారు సత్యం, సంపతిరావు హేమసుందరరాజు, పేరాడ వెంకట్రావు, శ్రీముఖలింగం గ్రామస్తులు పాల్గొన్నారు.

# కేన్సర్ బాధితునికి 'ఎలియన్స్' సాయం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గూనపాలెంకు చెందిన పొట్నూరు రాజేశ్వరరావు కేన్సర్‌తో పోరాడుతున్న విషయాన్ని స్మాల్ సర్వీస్ టూ సొసైటీ (ఎస్ఎస్ఎస్) ద్వారా తెలుసుకున్న ఎలియన్స్ క్లబ్ మిత్ర, సభ్యుల సహకారంతో రూ.11 వేలు, కిరాణా సామాన్లు, బరాటం భరతభూషణ్ రూ.5వేలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎలియన్స్ క్లబ్ మిత్ర ప్రెసిడెంట్ సూర్యప్రకాష్, సెక్రటరీ పీవీ కృష్ణారావు, పీఆర్వో ఎస్.త్రినాధరావు, డైరెక్టర్ ఇప్పిలి శ్రీనివాసరావు, స్మాల్ సర్వీస్ టు సొసైటీ సభ్యులు బరాటం భరత్ భూషణ్, చీపురు రామ్మోహన్, కలివరపు సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

# రెండో రోజు పుస్తక ప్రదర్శన

(సత్యంన్యూస్, పాలకొండ)

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా స్థానిక గవర్నమెంట్ హైస్కూల్ భౌతిక శాస్త్ర స్కూల్ అసిస్టెంట్ ముత్తిరెడ్డి గోవింద నాయుడు హాజరయ్యారు. పిల్లలకు విజ్ఞాన్ని అందించే పుస్తకాలు కథలు, జనరల్ నాలెడ్జ్, ప్రయోగాలు, వేదిక గణితం, జాతీయ నాయకుల జీవిత విశేషాలు, కథలతో పాటు విద్యార్థినీ విద్యార్థుల పోటీ పరీక్షలకు ఉపయోగపడే గ్రూప్స్ పుస్తకాలు, డీఎస్సీ, రైల్వే, బ్యాంకింగ్ కోర్సుల పుస్తకాలు వున్నాయి. ఇవే కాకుండా దినపత్రికలు, వార పత్రికలు, మాస పత్రికలు కూడా అందరికీ అందుబాటులో ఉంచారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు, సహాయకుడు రామకృష్ణ, పాఠకులు పాల్గొన్నారు.



# ప్రాథమిక స్థాయి నుంచే గ్రంథాలయాలు వినియోగించుకోవాలి



(సత్యంన్యూస్, లావేరు)

విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే గ్రంథాలయాలను వినియోగించుకోవాలని ఎంపీడీవో పి.వెంకటరాజు అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం లావేరు శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం వల్ల మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. మాదకద్రవ్యాల పట్ల కొంతమంది యువత తమ భవిష్యత్తును పాడుచేసుకుంటున్నారని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ గ్రంథాలయంలో గ్రూప్-1, 2 పుస్తకాలు కూడా ఉన్నాయని, అలాగే పోటీ పరీక్ష పుస్తకాలు ఉన్నాయని, నిరుద్యోగులు యువత వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయంలో చదువుకున్న బల్ల రవిశంకర్ తన తల్లిదండ్రులు లక్ష్మీకాంతం, ప్రకాశం జ్ఞాపకార్థము రూ.5వేలు విలువ గల పోటీ పరీక్షల పుస్తకాలను గ్రంథాలయానికి ఎంపీడీవో చేతుల మీదగా అందజేశారు. ఈ ప్రదర్శనలో ఇంగ్లీషు, హిందీ, సంస్కృతం, వేదాంతం, భాషా సాహిత్యం, వైద్యం, సైన్సు, చరిత్ర, ఖురాను, మహాభారతం, రామాయణం, భగవద్గీత, నవలా సాహిత్యం, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు ఉంచారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు పాల్గొన్నారు.

# సాగర జలాలు శుద్ధిచేసి ఉత్తరాంధ్రకు అందించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఉత్తరాంధ్రలోని పరిశ్రమలకు సాగర జలాలను శుద్ధి చేసి అందించగలిగితే చాలా బాగుంటుందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అభిప్రాయపడ్డారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా చెన్నై పట్టణానికి వెళ్లిన ఆయన చెన్నైలోని ఈసీఆర్ రోడ్‌లో సాగర జలాలను శుద్ధి చేసి లక్ష మందికి మంచినీటిని అందించే ప్రాజెక్టు దగ్గరకు వెళ్లి విధివిధానాలను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు పరిశీలించిన అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే ప్రాజెక్టు అని, ఉత్తరాంధ్ర పరిశ్రమలకు ఇదే విధంగా నీరు అందించేలా ఈ ప్రాజెక్టుపై సమగ్ర నివేదిక రూపొందించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు తెలిపారు. విజయనగరం పార్లమెంట్‌లోని పారిశ్రామికవాడలకు, నాగావళీ తీర ప్రాంత ప్రజలకు ఏ విధంగా ఉపయోగించగలమనే ఆలోచన చేయాలనుకుంటున్నట్లు వివరించారు. ఉత్తరాంధ్ర వ్యాప్తంగా భూగర్భ జలాలు తక్కువవుతున్న నేపథ్యంలో ఇలాంటి ప్రాజెక్టులు ప్రజలకు ఉపయోగపడతాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు.



# స్వాభిమాన్‌కు 14 వినతులు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రతీ నెల మూడో శుక్రవారం స్వాభిమాన్ వినతుల స్వీకరణ కార్యక్రమంలో భాగంగా జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో జిల్లాలో వివిధ మండలాల నుంచి వచ్చిన దివ్యాంగుల నుంచి జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్, జిల్లా రెవిన్యూ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా పరిషత్ సీఈవో శ్రీధర్ రాజు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ కవిత కలసి 14 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రతి అర్జీని సంబంధిత ప్రధానాధికారులు వ్యక్తిగతంగా పరిశీలించి ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. దివ్యాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్ (స్వాభిమాన్) వినతుల స్వీకరణ అవకాశాన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. నరసన్నపేట మండలం చిన్నబొరిగివలస గ్రామానికి చెందిన బుడియా శ్రీనివాసులు తనకు రేషన్‌కార్డు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. నగరం పరిధి సరంగుడోలవీధికి చెందిన బరాటం కృష్ణమూర్తి బ్యాటరీ ట్రై సైకిల్ మంజూరు చేయాలని విన్నవించారు. కొత్తూరు మండలం, కుంటిభద్ర గ్రామానికి చెందిన రుద్రపంక్తి బాలకృష్ణ 2017లో ఇల్లు మంజూరుచేసినా బిల్లు ఇవ్వలేదని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ కళ్యాణబాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయికుమార్, జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్, డ్వామా, గృహ నిర్మాణం సంస్థ, లీడ్‌బ్యాంకు, బీసీ కార్పొరేషన్, జిల్లా నలుమూలల నుంచి పలువురు దివ్యాంగులు హాజరయ్యారు.



జూనియర్ ఎన్టీఆర్ నటించిన దేవర సినిమా 50 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక సరస్వతీ థియేటర్ వద్ద అభిమానులు సంబరాలు జరుపుకొన్నారు. జిల్లా ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షులు, స్టేట్ వైడ్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ కన్వీనర్ దుంగ శ్రీధర్, పట్టణ అధ్యక్షులు, జిల్లా కళ్యాణ్‌రామ్ ఫ్యాన్స్ అధ్యక్షులు, స్టేట్ వైడ్ కన్వీనర్ బుర్రి మధు ఆధ్వర్యంలో వృద్ధులు, నిరాశ్రయులకు అల్పాహారం, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. - సత్యంన్యూస్, శ్రీకాకుళం

# తోటపాలెంలో ఫ్రైడే - డ్రైడే

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

దోమల వృద్ధిని అరికట్టి, తద్వారా వ్యాప్తిచెందే ప్రాణాంతక అంటువ్యాధులను నివారించడమే ధ్యేయంగా ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించే కార్యక్రమమే ఫ్రైడే - డ్రైడే కార్యక్రమమని పొన్నాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య పర్యవేక్షకురాలు డి.లిల్లీ రోజ్ మేరీ అన్నారు. తోటపాలెంలో శుక్రవారం పర్యవేక్షించి, ఇళ్లలోని రిఫ్రిజిరేటర్లు, కూలర్లలో నీరు నిల్వ లేకుండా తరచూ శుభ్రపరచాలని, ఫ్లవర్ వాజ్‌ల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, పాత టైర్లు, తాగి పారేసిన కొబ్బరి బొండాలను తొలగించాలని, తద్వారా దోమల వల్ల కలిగే ప్రాణాంతక అంటువ్యాధులు నుంచి రక్షణ పొందవచ్చన్నారు. అనంతరం గ్రామంలోని గర్భిణీ స్త్రీలను సందర్శించి ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలు జరిపించుకొనుటకు ప్రేరణ కలిగించారు. ఈ కార్యక్రమంలో స్థానిక హెల్త్ అసిస్టెంట్ ఇప్పిలి చిట్టిబాబు, ఎంఎల్‌హెచ్‌పీ బి.సాయి లక్ష్మీ, ఆశ కార్యకర్త కళావతి పాల్గొన్నారు.



# బలగ శాఖా గ్రంథాలయంలో..

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బలగ హడ్కో కాలనీలోని శాఖా గ్రంథాలయంలో శుక్రవారం గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేను ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ప్రముఖ కవి భోగెల ఉమామహేశ్వరరావు హిందీ ఉపాధ్యాయులు రవికుమార్ చేతుల మీదుగా ప్రారంభించిన ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రతిఒక్కరు పుస్తక పఠనంతోనే వ్యక్తి వికాసం వెల్లివిరుస్తుందన్నారు. ఈ పుస్తక ప్రదర్శనలో శ్రీదేవీ భాగవతం, సంపూర్ణ శ్రీశివ మహాపురాణం, శ్రీకృష్ణ చరిత, వేమన పద్య రత్నావళి, చందమామ కథలు, నిఘంటువులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ వినోద్‌కుమార్, సహాయకురాలు కె.అనిత, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



# జిల్లా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థలో శుక్రవారం పుస్తక ప్రదర్శనను ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు ప్రారంభించారు. గ్రంథాలయంలోని వివిధ పుస్తకాలను ప్రదర్శనలో ఉంచారు. ప్రభుత్వ మహిళా కళాశాల చరిత్ర విభాగాధిపతి డాక్టర్ ఎన్.చిన్నారావు, అధిక సంఖ్యలో గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూర్యచంద్రరావు మాట్లాడుతూ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఉన్న వివిధ రకాల గ్రంథాలు, రిఫరెన్స్, సాహిత్య పుస్తకాలు వినియోగించుకుని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం హైస్కూల్‌స్థాయి విద్యార్థినీ విద్యార్థులతో పాటల పోటీ నిర్వహించారు. న్యాయనిర్ణేతలుగా ఆరోహి సంగీత కళాశాల ఉపాధ్యాయిని సాహితి, పెంకి నాగేశ్వరరావు, సోడవరం ఈశ్వరరావు, గ్రంథాలయ కార్యదర్శి బి.కుమార్‌రాజు, డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్.శంకర్‌రావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ పి.వి.భాస్కర్ రాజా పాల్గొన్నారు.

# 18న మినీ జాబ్‌మేళా

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి శాఖ ఆధ్వర్యంలో టెన్త్ నుంచి పీజీ వరకు విద్యార్హత కలిగి 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి అర్హత, ఆసక్తి గల నిరుద్యోగ యువతకు మినీ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గుజరాతీపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 18న ఉదయం 9.30 గంటల నుంచి మినీ ఉద్యోగ మేళా జరుగుతుందని, వివిధ ప్రైవేట్ కంపెనీలు నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తాయన్నారు. అర్హత కలిగిన నిరుద్యోగ యువత వారి వారి విద్యార్హత పత్రాల నకలు, ఆధార్ కార్డు నకలు, 3 బయోడేటా పత్రాలు, 2 పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 95509 67353 నెంబర్‌ను సంప్రదించాలని, skilluniverse.apssdc.in వెబ్‌సైట్‌ను సందర్శించి రిజిస్టర్ కావాలని సూచించారు.

# 'బెల్టు' కట్టకపోతే సేల్ జారిపోతుందా?

(మొదటిపేజీ తరువాయి)

అదనంగా రూ.20 పెంచి విక్రయిస్తున్నారు. గార మండలం జొన్నలపాడులో బెల్టు షాపులకు వేలం పాటలు నిర్వహించిన వైనం సోషల్ మీడియా, పత్రికల్లో వైరల్ కావడంతో అక్కడకు వెళ్లిన ఎక్సైజ్ అధికారులు ఏడు బాటిళ్లతో ఒకరు పట్టుబడినట్లు ఒక కేసు నమోదు చేశారు. మద్యాన్ని ఆదాయవనరుగా చూస్తున్న ఏ ప్రభుత్వమైనా భారీగా అమ్మకాలు జరగాలనే కోరుకుంటుంది. ఇందుకోసం నిబంధనలను సైతం చూసీచూడనట్లు పక్కన పెడుతుంది. మద్యం దుకాణాలను కేవలం కాంక్రీట్ గదుల్లోనే ఏర్పాటు చేయాలన్న నిబంధనను సడలించి రేకుల షెడ్డులు, కంటైనర్లలో ఏర్పాటు చేసుకోవడానికి అనుమతిచ్చింది. అలాగే రూ.కోట్ల ఖర్చు చేసి వ్యాపారాలు చేసేవారంతా అధిక మొత్తంలో ఆదాయం సమకూరాలనే ఆకాంక్షతోనే ఉంటారు. కేవలం దుకాణాల్లో జరిగే అమ్మకాలనే నమ్ముకుంటే ప్రభుత్వ నిర్ణయాల వల్ల పెద్దగా లాభాలు వచ్చే పరిస్థితి ఉండదని చెబుతున్నారు.

# రాజ్యాంగ దినోత్సవ కరపత్రం ఆవిష్కరణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అంబేద్కర్ ఆడిటోరియం దరిలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట శ్రీకాకుళం జిల్లా, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ ర్యాలీ కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేదిక జిల్లా కన్వీనర్ బొడ్డేపల్లి మోహనరావ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి, పౌరులందరికి ప్రాథమిక హక్కులు సమానంగా అందివ్వడానికి మనమంతా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వేదిక సభ్య సంఘాల జిల్లా బాధ్యులు మిస్కా క్రిష్ణయ్య, పేడాడ కృష్ణారావు, డి.గణేష్, కళ్లేపల్లి రామ్‌గోపాల్, చౌదరి లక్ష్మణరావు, కేవీ జగన్నాధరావు, ఫల్గుణరావు, కిలారి ఈశ్వరరావు, పూజారి హరి ప్రసన్న, రాకోటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.




# కలగ లక్ష్మయ్య కళాపురస్కారాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పౌరాణిక నాటక రంగస్థల పితామహులు, కలియుగ హరిశ్చంద్ర కళాప్రపూర్ణ బిరుదాంకితుడు, శ్రీ శారదా నాటక కళాసమితి స్థాపకుడు కలగ లక్ష్మయ్య పేరుతో ప్రతీ ఏటా ఇస్తున్న కళా పురస్కారాలను శనివారం పెద్దపాడులో ప్రముఖులకు అందజేస్తున్నట్టు నిర్వాహకులు కలగ రాజబాబు బ్రదర్స్ ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మయ్య 24వ వర్ధంతి సందర్భంగా హరిశ్చంద్ర నాటకం నుంచి అరణ్య సీను నుంచి నాటకాన్ని వేస్తున్నట్టు వారు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# బలగలో బిర్సాముండా జయంతి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆదివాసుల ఆరాధ్య దేవుడు, గిరిజన నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధులు బిర్సా ముండా 150వ జయంతి బలగ సమీపంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, స్వాతంత్ర్య పోరాటంలో ఆంధ్రప్రదేశ్ గిరిజనుల పాత్ర అనే అంశంపై వక్తృత్వం, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులను క్లస్టర్ స్థాయి పోటీలకు పంపారు. 8,9 తరగతి విద్యార్థులకు విలువిద్య, వాలీబాల్, జావోలిన్‌త్రో పోటీలను నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.శ్రీనివాసరావు తెలిపారు.



# ప్రజలపై భారాలు ఇంక భరించలేం

(సత్యంన్యూస్, టెక్కలి)

ప్రజలపై భారాలు ఇంక భరించలేమని, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సీపీఎం ప్రజాపోరు కార్యక్రమాన్ని టెక్కలిలో చేపట్టారు. ధర్నా అనంతరం తహసీల్దార్ చక్రవర్తికి మెమొరాండం సమర్పించారు. ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించి ప్రజలపై భారాలు వేయడంతో ప్రజల్లో అసంతృప్తి పెరుగుతుందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నంబూరు షణ్ముఖరావు అన్నారు. విద్యుత్ ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేయాలని, ఉచిత ఇసుక అమలు చేయాలని, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని తదితర ప్రజాసమస్యలపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొల్లి యల్లయ్య, బగాది వాసుదేవరావు, హెచ్.ఈశ్వరరావు, దుర్గాప్రసాద్, కొర్రా గణేష్, తిర్లంగి అప్పన్న, వాకాడ ధనుంజయ, కె.ఎన్.పి.ఎస్ నాయకులు బెలమర ప్రభాకర్, సమాచార హక్కు చట్టం ప్రతినిధి అనపాన షణ్ముఖరావు పాల్గొన్నారు.




Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.